ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు

ఎమ్మెల్సీ కవితమ్మను కలిసిన రామలింగం

మక్తల్, మే 10 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితమ్మను మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని మక్తల్ బీఆర్ఎస్ నాయకుడు రుద్ర సముద్రం రామలింగం శనివారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారం ఆమెను కలుసు కోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కవితమ్మ త్వరలోనే నారాయణపేట జిల్లాలో తెలంగాణ జాగృతి బలోపేతం చేసేందుకు ఓ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కవితమ్మ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రణాళికలను సిద్ధం చేయాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, మే 10 : గ్రామాల్లో చేస్తున్న ఉపాధి హామీ పనులు 2025-2026 సంవత్సరానికి గానూ కొత్తగా ప్రణాళికలను సిద్ధం చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ అధికారులు నియోజకవర్గంలో దాదాపు 25పనులు మంజూరైనట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు సంబంధించి రైతులు పనులను చేయడానికి ముందుకురావడం లేదని తెలిపారు. పనులకు ఎస్టిమేట్ పెంచుతూ ప్రణాళికను తయారు చేయాలని నేను స్వయంగా సీఎం, కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవోలు విమల, పులేందర్, వెంకటేశ్, నవీన్, రాములు, ఈనీలు శ్రీనివాసులు, నాయకులు నవీన్‌గౌడ్, విజయ్‌గౌడ్, మచ్చందర్, తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలన

మాగనూరు, మే 10 : లక్ష్మీనర్సింహ స్వామి జాతర పనులను మక్తల్ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శనివారం పరిశీలించారు. మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి జరగబోయే స్వామివారి బ్రహ్మోత్సవాల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసు కోవాలని ఎస్సై అశోక్‌బాబుకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌గౌడ్, శివరాంరెడ్డి ఉన్నారు.

శిలాఫలకాన్ని పునరుద్ధరించాలి

ధ్వంసమైన శిలాఫలకం

మద్దూర్, మే10: అభివృద్ధి పనుల్లో భాగంగా గత ప్రభుత్వం మద్దూర్ బాలికల ఉన్నత పాఠశాలలో మన ఊరు- మనబడి కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏదైనా అభివృద్ధి పనులను అభివృద్ధిపరంగానే చూడాలని కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. రెండు రోజుల్లో శిలాఫలకాన్ని పునరుద్ధరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకొని శిలాఫలకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోపాల్, నాయకులు బసిరెడ్డి, మహేందర్, రాములు, నర్సింహులు, సురేశ్‌రావు, విఠల్, సాయిలు, భాస్కర్ పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

బాలానగర్, మే 10 : బాలానగర్ ఠాణా పరిధిలోని బోడజానంపేటలో శనివారం చెరువులో మునిగి ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఎస్సై లెనిన్ కథనం ప్రకారం.. బోడజానంపేటకు చెందిన మేకల వెంకటయ్య(42) శుక్రవారం పొలం వద్దకు వెళ్లివస్తానని భార్య చిట్టమ్మకు చెప్పి వెళ్లాడు. రాత్రంతా ఇంటికి రాకపోవడంతో శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వెతికారు. పొలానికి సమీపంలోని మైసమ్మ చెరువు సమీపంలో వెంకటయ్య బైక్, చెప్పులు, దుస్తులు కనిపించాయి. వెంకటయ్య సోదరుడు ఆంజనేయులు, కుమారుడు కార్తీక్ చెరువులోకి దిగి గాలించగా వెంకటయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య చిట్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భారత సైనికులకు మద్దతుగా పూజలు

భూత్పూర్ : పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భూత్పూర్, మే 10 : మండలంలోని అన్నాసాగర్‌లో రాజరాజేశ్వరీ, ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు పవన్‌కుమార్‌చే భారత సైనికులకు మద్దతుగా శనివారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఆల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మతాలు, రాజకీయ విబేధాలను పక్కన బెట్టి అన్ని పార్టీలు కలిసి భారతమాత రక్షణ కోసం కృషి చేయాలని కోరారు. యుద్ధంలో మరణించిన కుటుంబాలకు మనో ధైర్యం ఇవ్వాలని వేడుకొంటూ, దేశాభివృద్ధి ముఖ్యమని అన్నారు. భారత్-పాకిస్తాన్ యుద్ధంలో భారత సైనికులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఉండాలని కోరుతూ పూజలను చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట : కొండాపూర్ హనుమాన్ ఆలయంలో..

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, మే 10 : భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో భారత్‌కు విజయం చేకూరాలని, భారత సైనికులు, ప్రజలు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ మండలంలోని కొండాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి భారతీయుడు దేశం కోసం ఒక సైనికుడిగా మారాలని పలువురు గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రాఘవేంద్రాచారి, దామోదర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

రూ.1.20 లక్షల విలువైన గంజాయి పట్టివేత

బాలానగర్/జడ్చర్ల, మే 10: బాలానగర్ మండలం మోతీగణపూర్‌లో శనివారం 760 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. శనివారం జడ్చర్ల ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరుల మాట్లాడుతూ రాజాస్థాన్‌కు చెందిన ధన్‌రాజ్ మోతీగణపూర్‌లో ఓ వైపు కిరాణా కొట్టును నడిపిస్తూ మరోవైపు గంజాయిని విక్రయిస్తూ ధనార్జన చేస్తున్నాడు. బిర్జూసింగ్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో రూ.20వేలకు కిలో గంజాయిని ఖరీదు చేసి ధన్‌రాజ్‌కు అమ్ముతుంటాడని, ధన్‌రాజ్ 4గ్రాముల చొప్పున ప్యాకెట్లు చేసి రూ.300కు ఒక్కోపాకెట్ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటాడని తెలిపారు. గంజాయి విలువ రూ.1.20లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితుల నుంచి బైక్, 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఎస్సై నాగరాజు, హెచ్‌సీ మురళీమోహన్, కానిస్టేబుళ్లు చంద్రమౌలి, సిద్ధార్థ్, జ్యోతి పాల్గొన్నారు.

అప్రమంతంగా ఉండాలి

మాగనూరు, కృష్ణ, మే 10 : బార్డర్ చెక్‌పోస్ట్‌వద్ద అప్రమత్తంగా ఉండాలని మక్తల్ సీఐ రామలాల్ అన్నారు. రబి సీజన్ సందర్భంగా పొరుగు రాష్ట్రం నుంచి నారాయణపేట జిల్లాకు వరి ధాన్యం రాకుండా జిల్లా పరిధిలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా శనివారం మక్తల్ సీఐ రామలాల్ కృష్ణ బ్రిడ్జ్ బోర్డర్ చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. ధాన్యంతో వాహనాలు వస్తే రిటర్న్ పంపించాలి లేదా అధికారులకు అప్పగించాలన్నారు.

టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- హాజరైన 87.5 శాతం విద్యార్థులు

పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 10: తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (టీఎస్ఆర్ జేసీ-2025)లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 50 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 12,233 మంది విద్యార్థులకు గానూ 10,647 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 1,586 మంది గైర్హాజరుకాగా, 87.5శాతం హాజరు నమోదైంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు పరీక్ష జరుగగా.. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు చేపట్టారు. టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యా శాఖఅధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నిలువ నీడలేక

టీఎస్ఆర్‌జేసీ - సెట్ 2025 ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యార్థులు హాజరయ్యారు. వీరందరికీ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం, అర్బన్, గ్రామీణ మండలాల పరిధిలోనే కేంద్రాలు వేయడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, సహాయకులకు నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా కేంద్రాల సమీపంలో కనీసం మంచి నీటి సౌకర్యం సైతం కల్పించకపోవడంతో గుక్కెడు నీటితో గొంతు తడుపుకుందామన్నా.. నీళ్లు దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. చాలా వరకు అంతా నీటి సీసాలు, ప్యాకెట్లు కొనుగోలు చేసి గొంతు తడుపుకున్నారు. రెండున్నర గంటల పాటు చెట్టు, పుట్టా అన్నట్లు ఆయా కేంద్రాల సమీపంలోని చెట్ల కింద.. గోడల పక్కన.. నీడ దొరికిన చోట కూర్చోవడం, నిల్చోవడం, వాహనాలపైనే నిరీక్షించడం కన్పించింది. ప్రవేశ పరీక్ష సమయాల్లో కనీస ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు తమ కేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. విద్యార్థులు కేంద్రాల్లోకి వెళ్తే చాలు అన్నట్లుగా ప్రతి సారి ఇదే తంతుగా మారిందని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా ఉన్న తాధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

అమ్మిన ధాన్యాన్ని తీసుకెళ్లడం లేదు

- గన్నీ బ్యాగులు, లారీల కొరతతో అవస్థలు పడుతున్నాం
- అదనపు కలెక్టర్‌తో మొరపెట్టుకున్న రైతులు

అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో తమ గోడును వెల్లబోసుకుంటున్న రైతులు

నవాబ్‌పేట, మే 10 : కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించిన ధాన్యాన్ని తీసుకెళ్లేందుకు లారీలు రావడం లేదు.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చేందుకు గన్నీ బ్యాగులు లేవు.. అంటూ మండలంలోని కాకర్లపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆయా గ్రామాల రైతులు అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు మొరపెట్టుకున్నారు. మండలంలోని కాకర్లపహాడ్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మోహన్‌రావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోహన్‌రావు ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సమయంలోనే రైతులు తమ ఆవేదనను వెల్లడించారు. గన్నీ బ్యాగులు లేక పొలాల నుంచి చాలా మంది రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావడం లేదని..వాపోయారు. ఎవరైనా రైతులు అష్టకష్టాలు పడి ధాన్యం కొనగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయిస్తే..వాహనాలు రాక ధాన్యం రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలోనే మూలుగుతోందని వాపోయారు. లారీలు రాక కొన్న సరుకంతా ఇక్కడే నిలిచిపోతోందని, కొనుగోలు కేంద్రం నిర్వాహించే మహిళా సంఘం సభ్యులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. విషయాన్ని గమనించిన అదనపు కలెక్టర్ హుటాహుటిన..ఏపీఓ జీవరత్నంతో కలిసి జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయానికి వెళ్లి అక్కడ లారీలు మాట్లాడి కాకర్లపహాడ్‌కు పంపించారు. దీంతో సాయంత్రం నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని లిఫ్టింగ్ చేస్తున్నట్లు ఏపీఎం జీవరత్నం తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు తనిఖీలు

- ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నర్వ వద్ద తోటలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మక్తల్, మే 10 : జిల్లాలో మత్తు పదార్థాలను నిర్మూలించి యువత చెడు మార్గంలో నడవకుండా ఉండాలని లక్ష్యంతోనే ముమ్మరంగా తనిఖీలు చేపట్టడం జరిగిందని ఎస్పీ యోగేశ్‌గౌతం అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మత్తు పదార్థాలను నిర్మూలించడానికి మక్తల్ నియోజకవర్గం నర్వ మండల కేంద్రంలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసులు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించరన్నారు. గంజాయి రవాణా, మత్తు పదార్థాలు అమ్మకం, గంజాయినీ ఇతర పంట పొలాల్లో పెంచడం వంటి అనుమానాస్పద కేంద్రాలను ముమ్మరంగా తనిఖీ చేసి వాటి అన్నింటినీ నియంత్రించడం జరుగుతుందన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను రవాణా చేసి, మత్తు పదార్థాలకు బానిసైన వారి వివరాలు తెలిస్తే వెంటనే 100 కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేశ్‌బాబు, నార్కోటిక్స్ స్నైపర్‌డాగ్ విక్కీ, డాగ్ హ్యాండ్లర్ పరమేశ్ పాల్గొన్నారు.

అమర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

నవాబ్‌పేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

నవాబ్‌పేట/ఊట్కూర్, మే 10 : దేశ రక్షణ కోసం వీరమరణం పొందిన మురళీనాయక్‌కు పలువురు నాయకులు కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. నవాబ్‌పేట మండల కేంద్రంలోని ఎర్రసత్యం చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొవ్వొత్తులతో నివాళులర్పించి మాట్లాడారు. మురళీనాయక్ వీరమరణం పొంది యావత్ దేశ ప్రజలకే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అదేవిధంగా ఊట్కూర్ మండలం తిమ్మారెడ్డిపల్లి తండా గిరిజనులు భారత జవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. వీర జవాన్‌కు జేజేలు పలుకుతూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన గిరిజన బిడ్డ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాజునాయక్, అనిల్‌నాయక్, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

ఊట్కూర్ : తిమ్మారెడ్డిపల్లి తండాలో గిరిజనులు

హత్య కేసు నిందితుడి అరెస్ట్

భూత్పూర్, మే10 : మండలంలోని వెల్కిచర్లలో ఈ నెల 2వ తేదీన కొత్త గొల్ల నాగమ్మ హత్య కేసును ఛేదించినట్లు భూత్పూర్ సీఐ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త గొల్ల నాగమ్మ మృతి చెందిన రోజు అదే గ్రామానికి చెందిన కొట్టే పర్వతాలుతో ఫోన్‌లో ఎక్కువ సమయం మాట్లాడింది. ఈ విషయంలో అతడిని పూర్తిస్థాయిలో విచారించగా మృతురాలు కొట్టే పర్వతాలు కూతురి పెండ్లికి రూ.50వేలు ఇచ్చింది. ఈ డబ్బుల విషయం, అక్రమ సంబంధం విషయంలో తేడాలు రావడంతో వేట కొడవలితో కొట్టి చంపినట్లు సీఐ తెలిపారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విజేతలకు అభినందనలు

ఊట్కూర్, మే 10 : నారాయణపేట జిల్లా నుంచి విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని బీజ్వారం అంబాత్రయ క్షేత్రం వ్యవస్థాపకుడు ఆదిత్య పరాశ్రీ స్వామీజీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ కాంతారావు ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోహెడ గ్రామ అడవుల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మౌంటెన్ సైకిలింగ్ పోటీల్లో రాయికోడ్ గ్రామానికి చెందిన అనూష 10 కి.మీ. మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొని సిల్వర్ మెడల్ దక్కించుకున్నది. అలాగే మక్తల్ మండలం గుర్లపల్లికి చెందిన ఆర్. స్వప్న ఢిల్లీలో జరిగిన ఏసీఎన్ షూటింగ్ బాల్ క్రీడల్లో కాంస్య పథకం సాధించినది. రాష్ట్ర స్థాయి సైకిలింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన టి. అనుషు, అంతర్జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో కాంస్య పథకం సాధించిన ఆర్. స్వప్న, రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచిన విద్యార్థులు సాయి కీర్తన, అజయ్‌ని శనివారం ఆదిత్య పరాశ్రీ స్వామీజీ శాలువాలతో సత్కరించి ఆశీర్వదించారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరింత ఎత్తుకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సైకిలింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, విశ్రాంత, పీఈటీ గోపాలం, జిల్లా షూటింగ్ బాల్ కార్యదర్శి రమేశ్‌కుమార్, గోపి గౌడ్, అనీల్ పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

నారాయణపేట, మే 10: పోలీసు వాహన డ్రైవర్లు వాహనాల మెకానిజంపై అవగాహన ఉండాలని ఆర్ఎస్సై శివశంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలోని శిక్షణ కేంద్రంలో పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

కేసు నమోదు

మూసాపేట(అడ్డాకుల), మే 10 : వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఎస్సై కథనం మేరకు అడ్డాకుల మండలం కందూరు అనుబంధ గ్రామం చౌడాయిపల్లికి చెందిన లలితమ్మ, బాలస్వామి దంపతుల కుమారుడు వెంకటేశ్(22). కాగా తల్లి లలితమ్మ కొన్ని ఎండ్ల కిందట భర్తలను, కుమారుడిని వదిలి వెళ్లిపోయింది. వెంకటేశ్ తన తండ్రి బాలస్వామితోనే ఉంటున్నాడు. బాలస్వామి ఉప్పరి గుంపులో పనికి వెళ్తుండగా వెంకటేశ్ మాత్రం ఇంటి వద్దనే ఒంటరిగా ఉంటున్నాడు. కాగా నాలుగు రోజుల కిందట వెంకటేశ్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి ఎస్సై శ్రీనివాసులు పంచనామా నిర్వహించారు. మృతుడి మెనత్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ వాహనం

బాలానగర్, మే 10 : మండలంలోని అమ్మపల్లికి చెందిన దివ్యాంగుడు శ్రీశైలానికి బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ అభిమన్యురెడ్డి రూ.30వేల విలువైన ఎలక్ట్రిక్ వాహనాన్ని ఇప్పించారు. శ్రీశైలం డిగ్రీ ఫైనల్ సంవత్సరం చదువుతున్నాడు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటాచారి, శ్రీనివాసరావు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజులు అన్నింటా రాణించాలి

ఊట్కూర్, మే 10 : తెలంగాణలో అధిక జనాభా ఉన్న ముదిరాజులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నామని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. శనివారం ఊట్కూర్ మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న ముదిరాజులు పాలకుల నిర్లక్ష్యంతో అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజులు విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఇటీవల పదో తరగతి పబ్లిక్ పరీక్షలో 500 మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులతోపాటు ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో 400, సెకండ్ ఇయర్‌లో 900 మార్కులు సాధించిన వారికి, వివిధ ప్రభుత్వ కొలువులు సాధించిన యువతకు జిల్లా కేంద్రంలో సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, నారాయణ, భరత్, కృష్ణ, హన్మంతు, రమేశ్, కనకప్ప, రమేశ్, సుమన్, రోషినప్ప, నారాయణ పాల్గొన్నారు.

క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

మహబూబ్‌నగర్ అర్బన్, మే 10 : జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు శిక్షణలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్నాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేశ్ కుమార్, అబ్దుల్లా ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

మక్తల్, మే 10 : వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొంది పెన్షన్ తీసుకుంటున్నటువంటి పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం మండలాధ్యక్ష, కార్యదర్శులు గోపాలం, భాస్కర్ అన్నారు. శనివారం మక్తల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మక్తల్ మండల విశ్రాంత ఉద్యోగుల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందినటువంటి ఉద్యోగులకు రావల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సిద్ధి లింగయ్య, సూర్య ప్రకాశ్, కృష్ణయ్య గౌడ్, మల్లికార్జున్, నాగిరెడ్డి, జనార్దన్, సురేందర్, నారాయణ రెడ్డి, రాములు, ఉన్నారు.

హమాలీ రేట్లు పెంచాలి

ధన్వాడ, మే 10: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హమాలీ కూలీల రేట్లను పెంచాలని నారాయణపేట జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. కూలీ రెట్లు పెంచాలనీ కోరుతూ శనివారం మండల కేంద్రంలోని దుకాణదారులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కతలప్ప, భాను, బాలనర్సింహులు, ఆంజనేయులు, కుర్మయ్య, మల్లేశ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ధన్వాడ, మే 10: నారాయణపేట జిల్లా నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికను శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు నెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్‌గౌడ్, అంజద్‌ఆలీ తెలిపారు. మొత్తం 45మంది విద్యార్థులకు 24మంది విద్యార్థులను ఎంపిక చేశామని, ఈనెల 15నుంచి 18వరకు జనగామ జిల్లాలో నిర్వహించే 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో వెంకటేశ్‌శెట్టి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

భూత్పూర్, మే 10: మండలంలోని శేరిపల్లి(బీ)శివారులో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందినట్లు ఎస్సై చంద్ర శేఖర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం కడప జిల్లా బద్వేల్ చెందిన అనకర్ల ప్రవీణ్‌కుమార్(43) శివదర్శిని ట్రావెల్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. బస్సు కడప నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా జాతీయ రహదారి 44పై రిపేరుకు వచ్చింది. శివదర్శిని వేరే ట్రావెల్ బస్సులో మహబూబ్‌నగర్ మండలం దొడ్డలోనిపల్లికి చెందిన శ్రీహర్ష డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రవీణ్‌కుమార్ ఉన్న బస్సు రిపేరుకు రావడంతో శ్రీహర్ష దొడ్డలోనిపల్లిలో